క్లుప్తంగా

నేడు బడ్జెట్ సమావేశం

బోధన్‌టౌన్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో బల్దియా బడ్జెట్‌పై మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మాశరత్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ మంగళవారం తెలిపారు. సమావేశానికి కౌన్సిలర్లు, అధికారులు హాజరు కావాలని కోరారు.

సంకల్ప యాత్రను విజయవంతం చేయండి

నందిపేట్: విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని కోరుతూ మండల కేంద్రంలో బీజేపీ నాయకులు మంగళవారం సమావేశం నిర్వహించారు. యాత్రలో భాగంగా బుధవారం మండలంలోని వెల్మల్ మీదుగా నందిపేటకు యాత్ర చేరుకుంటుందని తెలిపారు. పార్టీ శ్రేణులు కలిసికట్టుగా పనిచేసి మరోసారి మోదీని గెలిపిద్దామని పిలుపునిచ్చారు. యాత్రను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ మండలాల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు

బస్సులు అందుబాటులో ఉంచాలి

ఆర్మూర్‌టౌన్: ఇంటర్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఆర్టీసీ అధికారులు బస్సులను అందుబాటులో ఉంచాలని ఎస్‌ఎఫ్‌ఐ ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి నాగరాజు అన్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ పృథ్వీరాజ్‌గౌడ్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. పరీక్షల సమయంలో పిప్రి విద్యార్థులకు ప్రత్యేక బస్సులను కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జవహర్‌సింగ్ పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు



రెంజల్: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు మంగళవారం వీడ్కోలు పార్టీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బలరాం మాట్లాడుతూ.. పదో తరగతి అనేది విద్యార్థులకు తొలి మెట్టు అని, ఇష్టపడి చదివితే జీవితంలో ఉన్నతస్థాయికి చేరుతారని అన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

విండో వైస్‌చైర్మన్‌పై వీగిన అవిశ్వాసం

వర్ని: మండలంలోని జాకోర ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఉపాధ్యక్షుడు గఫర్‌పై సంఘ సభ్యులు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం మంగళవారం వీగిపోయింది. అవిశ్వాస తీర్మానంపై ఉదయం జిల్లా సహకార అధికారి శ్రీనివాస్ ఓటింగ్ నిర్వహించగా సభ్యులు ఎవరూ హాజరు కాకపోవడంతో అవిశ్వాసం వీగిపోయినట్లు ప్రకటించారు. వారం రోజుల క్రితం సంఘంలోని పదిమంది డైరెక్టర్లు డీసీవోకు అవిశ్వాసం నోటీసులు అందజేశారు. ఓటింగ్‌లో ఎవరు పాల్గొనకపోవడంతో అవిశ్వాసం వీగిపోయినట్లు తెలిపారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



బోధన్: మండలంలోని కల్దుర్కి సొసైటీ చైర్మన్ శరత్, ఐడీసీఎంఎస్ డైరెక్టర్ రాజాగౌడ్, సిద్ధాపూర్ సర్పంచ్ అశోక్ పటేల్ జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో మంగళవారం చేరారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే కండువా వేసి ఆహ్వానించారు. సాలూర సొసైటీ చైర్మన్ అల్లె జనార్దన్, నాయకులు గంగాశంకర్, నాగేశ్వర్‌రావు, భయ్యన్ సురేశ్‌పటేల్, ప్రకాశ్ పటేల్, లాలయ్య, గంగాధర్ పటేల్ ఉన్నారు.

చేవెళ్లకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు



రెంజల్: సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన చేవెళ్ల సభకు మండలంలోని కాంగ్రెస్ నాయకులు, మహిళలు మంగళవారం తరలివెళ్లారు. సభకు తరలిన వారిలో సర్పంచ్ మర్లరమేశ్‌కుమార్, పార్టీ మండల అధ్యక్షురాలు ఇందిరారెడ్డి, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మి, నాయకులు సాయిబాబాగౌడ్, వెంకటి, వేణు, ఐకేపీ సిబ్బంది ఉన్నారు.

పాడి గేదెల పెంపకానికి ముందుకు రావాలి

మాక్లూర్: పాడిగేదెల పెంపకానికి రైతులు, నిరుద్యోగ యువత ముందుకు రావాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, స్వయం ఉపాధి సంస్థ ప్రతినిధి రామకృష్ణ సూచించారు. పాడి పరిశ్రమను పెంపొందించేందుకు మండలంలోని అమ్రాద్‌లో ఈ నెల 18న ప్రారంభమైన శిక్షణ కార్యక్రమం మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా శిక్షణ పొందిన అభ్యర్థులు పాడిపరిశ్రమపై రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో స్థానిక పశువైద్యాధికారి కిరణ్‌దేశ్ పాండే, గ్రామస్తులు పాల్గొన్నారు.

డిమాండ్ ఫుల్.. కలెక్షన్ నిల్!

- బాల్కొండ మండలంలో పేరుకుపోయిన ఇంటి పన్ను బకాయిలు
- వసూలు చేయడంలో అధికారుల అలసత్వం



బాల్కొండ మండల పరిషత్ కార్యాలయం

బాల్కొండ: మండల పరిధిలోని గ్రామాల్లో ఇంటి పన్ను పేరుకు పోయింది. దీంతో డిమాండ్ ఫుల్ ఉన్నప్పటికీ కలెక్షన్ మాత్రం నిల్ అన్నట్లుగా మారింది. నిత్యం పల్లెల్లో పన్ను వసూళ్లు చేపట్టాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పన్నుల వసూళ్లు పడకేస్తున్నాయి. పంచాయతీ కార్యాలయాలకు ప్రజలు సంతకాల అవసరాల నిమిత్తం వస్తేనే అధికారులు సంతకాలకు, ఇంటి పన్నుకు లింకు పెట్టి వసూలు చేస్తున్నారే తప్ప ప్రత్యేకంగా వసూలు చేయడం లేదు. బాల్కొండ మండల కేంద్రంలో పది జీపీలు ఉన్నాయి. మరో నెల గడిస్తే ఆర్థిక సంవత్సరం పూర్తవుతుంది. కానీ ఇప్పటి వరకు ఒక్క గ్రామ పంచాయతీలో 60 శాతం ఇంటి పన్ను వసూలు కూడా కాలేదు. పది గ్రామ పంచాయతీలకు కలిపి రూ. 1,25,26,038 డిమాండ్ ఉంది. ఇప్పటి వరకు రూ. 51,10,058 మాత్రమే వసూలయ్యాయి. అంటే మొత్తం జీపీల్లో కలిపి ఇప్పటి వరకు 40.8 శాతం మాత్రమే అధికారులు ఇంటి పన్ను వసూలు చేశారు. ఇంకా రూ. 74,15,980 ఇంటి పన్ను వసూలు చేయాల్సి ఉంది. అధిక మొత్తం రూ. 50 లక్షల ఇంటి పన్నుల బకాయి ఒక్క బాల్కొండ గ్రామ పంచాయతీలోనే ఉంది. ఇంటి పన్ను వసూలుకు ఇప్పటి వరకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు కాలేదు. ప్రత్యేకాధికారుల పాలనలోనైనా పూర్తి స్థాయిలో ఇంటి పన్నుల బకాయిలు వసూలై గ్రామాల అభివృద్ధికి ఉపయోగపడతాయని ప్రజలు ఆశిస్తున్నారు.

పేదలకు ఇళ్లు నిర్మించి ఇస్తా

- ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి

మాక్లూర్: ఇల్లులేని నిరుపేదలకు ఇళ్లు నిర్మించి ఇస్తానని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడిరాకేశ్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గంలో ఉన్న 87 గ్రామాల్లో పూరిగుడిసె అనేదే లేకుండా చేస్తానని ప్రతిజ్ఞ చేశారు. మంగళవారం మండలంలోని కల్లెడి గ్రామంలో నిర్వహించిన సేవాలాల్ జయంతి కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. గత ఎమ్మెల్యే డూప్లికేట్ ప్రొసీడింగ్‌లు ఇస్తూ మోసం చేయటమే కాకుండా అవసరైన చోట బెదిరింపులకు పాల్పడ్డాడని విమర్శించారు. తాను అలా కాదని పేదవారిని అన్నివిధాలుగా ఆదుకుంటానని అన్నారు. ప్రభుత్వంతో పోరాడి నియోజకవర్గానికి 5 వేల ఇళ్లు మంజూరు చేయించుకు వస్తానని అన్నారు. జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు మాట్లాడుతూ.. గిరిజన తండాల అభివృద్ధికి కృషి చేస్తానని హామీ అన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ లతాపీర్‌సింగ్, గిరిజన నాయకులు రాయ్‌సింగ్, బెలోజీ నాయక్, ఎంపీడీవో క్రాంతి, తహసీల్దార్ మహ్మద్ షబ్బీర్, మాజీ సర్పంచ్ లావణ్య ప్రసాద్‌గౌడ్, గంగోనే సంతోష్, డిప్యూటీ తహసీల్దార్ పద్మ, ఆలూర్ తహసీల్దార్ గిరిశ్, గ్రామస్తులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముందు ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి కల్లెడి,అడవి మామిడిపల్లిలోని ఒడ్డెర కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు.

వైభవంగా వేంకటేశ్వర కల్యాణం

మాక్లూర్: మండలంలోని అడవి మామిడిపల్లి శివారులో అపురూప వేంకటేశ్వర ఆలయంలో స్వామి వారి కల్యాణాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్‌పర్సన్ అమృలత, ప్రభాదేవి, ఆలయ ప్రధాన అర్చకుడు కుమారస్వామి, వేదపండితులు, నరేందర్‌రెడ్డి, రాజారెడ్డి, రమాదేవి పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న లక్ష్మి, నాగ్‌నాథ్, కిశోర్



నృత్యం చేస్తున్న విద్యార్థులు

బోధన్‌టౌన్: విలువతో కూడిన విద్యను విద్యార్థులకు నేర్పిస్తే వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని లయన్ డిస్ట్రిక్ గవర్నర్ లక్ష్మి, ఎంఈవో నాగ్‌నాథ్, పాఠశాల కరస్పాండెంట్ కొడాలి కిశోర్ కుమార్ అన్నారు. పట్టణంలోని ఆచన్‌పల్లిలో ఉన్న ఇందూరు ఉన్నత పాఠశాల 22 వార్షికోత్సవ వేడుకలను సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు క్రమశిక్షణతో విద్యను నేర్పించాలని సూచించారు. విద్యార్థులు సెల్‌ఫోన్‌లకు ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో లయన్ అమర్‌నాథ్‌రావు, నర్సింహారెడ్డి, ప్రవీణ్, బసవేశ్వర్‌రావు, సూర్యనారాయణ, శ్రీనివాస్‌రావు, లావణ్య, హెచ్‌ఎంలు రామారావు, సుధారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

‘పది’లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో

రెంజల్: పదో తరగతి ఫలితాల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో దుర్గాప్రసాద్ సూచించారు. మండలంలోని వీరన్నగుట్ట, కేజీబీవీ, ఆదర్శ పాఠశాల హాస్టల్‌ను మంగళవారం సందర్శించారు. ఉపాధ్యాయులు సెలవులకు వెళ్లకుండా ప్రత్యేక తరగతుల ద్వారా విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలన్నారు. పదికి పది జీపీఏ సాధించేలా కృషి చేయాలన్నారు. విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలు తెలుసుకున్నారు. డీఈవో వెంట ఎంఈవో గణేశ్‌రావు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

వార్డుల్లో పర్యటించిన వినయ్‌రెడ్డి



సమస్యలను తెలుసుకుంటున్న వినయ్‌రెడ్డి

పెర్కిట్: మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి 8, 9 వార్డులలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌రెడ్డి మంగళవారం పర్యటించారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం 9వ వార్డు కౌన్సిలర్ కోనపత్రి కవిత కాశీరాం వినయ్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆయన వెంట కౌన్సిలర్లు మెడిదాల సంగీత రవిగౌడ్, ఆకుల రాము, నాయకులు సాయిబాబా గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ మున్ను, చరణ్‌రెడ్డి, శ్యాం గౌడ్, తవ్వన్న, గంగాధర్, అఖిల్, ఆకుల ప్రశాంత్, లక్కారం నరేశ్, నటరాజ్, వంశీ, ప్రసాద్, యోగిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

బోధన్‌టౌన్(బోధన్): ఇంటర్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. బోధన్ డివిజన్‌లో 12 పరీక్షా కేంద్రాలను సంబంధిత అధికారులు ఏర్పాటు చేశారు. బోధన్ పట్టణంలో 9, వర్ని 2, కోటగిరిలో 1 పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఇంటర్ అధికారులు తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలకు 4,256 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 4,123 మంది మొత్తం 8,379 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. విద్యార్థులు 8:30 గంటల వరకు పరీక్షా కేంద్రాలకు హాజరు కావాలని అధికారులు సూచించారు.

వర్నిలో..

వర్ని: మండల కేంద్రంలో బుధవారం నుంచి నిర్వహించే ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రవి కుమార్ తెలిపారు. మండలంలో రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా 419 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకోవాలి



ఆర్మూర్‌టౌన్: విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకొని ఆ దిశగా పయనించాలని ఆర్మూర్ ఎన్‌డీసీసీబీ మేనేజర్ సందీప్‌శర్మ అన్నారు. పట్టణంలోని రాం మందిర్ పాఠశాలలో ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా జిల్లా సహకార బ్యాంకు ఆర్మూర్‌శాఖ ఆధ్వర్యంలో ఆర్థిక స్వావలంబన గురించి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు నగదు, మెమొంటోలు అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం చలం, ఫీల్డ్ ఆఫీసర్ చంద్రమోహన్, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

మేరు కులస్తులను ఆదుకోవాలి

రుద్రూర్: మారిన ఫ్యాషన్ ప్రపంచంలో దర్జీలకు పని లేకుండా పోయిందని ఉమ్మడి మండల మేరు సంఘం అధ్యక్షుడు కౌలస్ గంగాధర్ మంగళవారం అన్నారు. రెడీమేడ్ రంగం విస్తరించడంతో టైలరింగ్‌కు గిరాకీ తగ్గిందని, తమ పరిస్థితి దయనీయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పంపిణీ చేసే స్కూల్ యూనిఫామ్స్ మేరు కులస్తులకే ఇవ్వాలని కోరారు.

పందులకు స్వైన్ ఫ్లూ టీకాలు

ఆర్మూర్ టౌన్: పట్టణంలోని వెటర్నరీ ఆస్పత్రిలో పందులకు స్వైన్ ఫ్లూ టీకాలు ఇచ్చినట్లు అసిస్టెంట్ డైరెక్టర్ జియావుద్దీన్ తెలిపారు. పందుల నుంచి కొన్ని రకాల వ్యాధులు మనుషులకు సంక్రమించే అవకాశం ఉన్నందున వాటి ఆరోగ్యా రీత్యా స్వైన్ ఫ్లూ టీకాలు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా కేంద్రం నుంచి అసిస్టెంట్ డైరెక్టర్ బసవరెడ్డి పశువుల నుంచి రక్త నమూనాలను సేకరించినట్లు చెప్పారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ రోజా, సిబ్బంది పవన్, మల్లేశ్, పందుల యజమానులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

బోధన్: బోధన్ రియల్‌ఎస్టేట్ ఏజెంట్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం మంగళవారం ఎన్నికైంది. పట్టణంలో రియల్ ఎస్టేట్ ఏజెంట్లు మంగళవారం సమావేశం నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా టి. చందు, వైస్ ప్రెసిడెంట్‌గా నజీముద్దీన్, సెక్రటరీలుగా రమేశ్ పవార్, దౌలత్ సింగ్, జాయింట్ సెక్రటరీగా మోహిద్, ట్రెజరర్లుగా జానకి రామరాజు, నిజాముద్దీన్, అడ్వైజర్లుగా ఉపేందర్, ఆసిఫ్, హమీద్, వాజీద్, ఈసీ మెంబర్లుగా వసీం, అలీం, రషీద్, ముజీబ్, రౌఫ్ ఎన్నికయ్యారు.

దాడులకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి



ఏసీపీకి వినతిపత్రం అందజేస్తున్న కార్యదర్శులు

వర్ని: జీపీల్లో గ్రామపంచాయతీ కార్యదర్శులపై దాడులకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని మండలంలోని జీపీ కార్యదర్శులు బోధన్ ఏసీపీ శ్రీనివాస్‌కు మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. మండలంలోని సైదుపూర్‌లో సోమవారం ఓ వ్యక్తి కరెంటు మీటర్ కోసం పంచాయతీ కార్యదర్శికి ధ్రువపత్రం కోరగా ఇంటి పన్ను చెల్లిస్తేనే ధ్రువపత్రం ఇస్తామని అనడంతో సదరు వ్యక్తి అసభ్య పదజాలంతో భౌతిక దాడికి పాల్పడినట్లు వినతిపత్రంలో కార్యదర్శులు పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. జీపీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు శ్రావణ్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ సౌజన్య, వినోద్, సాయిలు, కృష్ణకాంత్, శేఖర్, ముస్తక్, సురేష్, శ్రీకాంత్, వినోద్, మినాజ్, సూర్య, వేణు, స్వప్న, శివ, శిబా, సౌమ్య, లయ ఉన్నారు.

సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యం



వర్ని(మోస్రా): అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసినప్పుడు అభివృద్ధి సాధ్యమని మోస్రా జెడ్పీటీసీ గుత్ప విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. ఇటీవల బదిలీపై వెళ్లిన ఎంపీడీవో భారతిని అధికారులు, ప్రజాప్రతినిధులు మంగళవారం సన్మానించారు. మంచి పనితనంతోనే గుర్తింపు లభిస్తుందని జెడ్పీటీసీ అన్నారు. సమావేశంలో ఎంపీపీ పిట్ల ఉమ, శ్రీరాములు, తహసీల్దార్ మారుతి, ఎంపీవో రఫీ, కోఆప్షన్ సభ్యులు ఫెరోజ్, సిబ్బంది ఉన్నారు.

షబ్బీర్ అలీని కలిసిన నాయకులు



ఆర్మూర్‌టౌన్: రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ అభివృద్ధి సలహాదారుడు షబ్బీర్ అలీని మాదిగ సంఘాల యూనైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొక్కెర భూమన్న, తెలంగాణ మాదిగ హక్కుల దండోరా జాతీయ అధ్యక్షుడు వేముల బలరాం మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మాదిగ, మాదిగ ఉపకులాలకు ప్రత్యేక కార్పొరేషన్లను ఏర్పాటు చేయాలని కోరారు. చేవేళ్ల డిక్లరేషన్‌లో చెప్పిన ప్రకారం 18 శాతం రిజర్వేషన్లు పెంచాలని విజ్ఞప్తి చేశారు.

ఆధ్యాత్మికం..

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



ఎడపల్లి: మండలంలోని జైతాపూర్‌లో ఉన్న శ్రీరామ ఆలయ 13వ వార్షికోత్సవాన్ని ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, పల్లకీసేవ చేపట్టారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు కరటూరి సత్యనారాయణ చౌదరి, వాకలపూడి కృష్ణారావు, సత్యనారాయణ, మదన్ భాస్కరరావు, సూర్యనారాయణ, ఈరెంటి లింగం, బిక్కి సత్యనారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

నాగాపూర్‌లో విగ్రహ ప్రతిష్ఠాపన

బాల్కొండ: మండలంలోని నాగాపూర్ శివారులో ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ తీరన నిర్మించిన నాగలింగేశ్వర స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆలయ విగ్రహాలను ఊరేగించారు. ఆలయం ఎదుట హోమం చేపట్టారు. మహిళలు చేసిన దాండియా ఆకట్టుకుంది. కార్యక్రమంలో పలుగుట్ట మహరాజ్ మంగిరాములు మహరాజ్, పండితులు, వీడీసీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లిలో..



కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలో రజక సంఘం సభ్యుల కుల దైవం శ్రీమడేళ్వేర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనను మంగళవారం ఘనంగా చేపట్టారు. ఉత్సవాల్లో భాగంగా నది జలాలు, ఉత్సవ మూర్తులను శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవాలయం నుంచి జాతీయ రహదారి మీదుగా కుడుగుంట్ల ఆలయం వరకు ఊరేగింపుగా చేపట్టారు. ఆలయంలో మహాగణపతి పూజ, పుణ్యాహవచనం, యాగశాల ప్రవేశం, అఖండ దీపారాధన, అగ్ని ప్రతిష్ఠ, జలాధివాసం, మంగళహారతి, మంత్రపుష్పం పలు పూజా కార్యక్రమాలను పురోహితుడు రమేశ్‌చంద్ర శాస్త్రి ఆధ్వర్యంలో నిర్వహించారు.

వైభవంగా శ్రీలక్ష్మీగణపతి విగ్రహ ప్రతిష్ఠాపన



విగ్రహాన్ని జలాధివాసానికి తీసుకెళ్తున్న ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు

రుద్రూర్: మండల కేంద్రంలోని అంగడి బజార్‌లో నూతనంగా నిర్మించిన శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ వేడుకలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో ప్రతిష్ఠించనున్న శ్రీలక్ష్మీ గణపతి విగ్రహాన్ని గ్రామంలోని ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర చేపట్టారు. ఆలయంలో సుప్రభాత సేవ, మహగణపతి పూజ, గోపూజ, యాగశాల ప్రవేశం, నవగ్రహ మాతృకో స్థాపనం, అగ్ని ప్రతిష్ఠ, జలాధివాసం, యజ్ఞం చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఉత్సవాలు మూడు రోజుల పాటు కొనసాగుతాయని ఆలయ కమిటీ చైర్మన్ వసంతసంజీవరెడ్డి పేరొన్నారు. ఉత్సవాలను భక్తులు విజయవంతం చేయాలని కోరారు.

సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలి

కమ్మర్‌పల్లి: విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలని జగిత్యాల జిల్లా సైన్స్ అధికారి బాజోజి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కోనాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ప్రదర్శనను మంగళవారం ప్రారంభించారు. విద్యార్థులు ప్రకృతిలోని పలు అంశాలను నిశితంగా గమనించినప్పుడే భవిష్యత్తులో శాస్త్రవేత్తలుగా ఎదుగుతారని అన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాంప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు

పెర్కిట్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కెట్, కోటార్మూర్ గ్రామాల్లో విద్యుత్ శాఖ అధికారులు మంగళవారం ఎనిమిది ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఈఈ హరిచంద్ మాట్లాడుతూ.. వేసవి కాలంలో ప్రజలకు ఓవర్ లోడ్‌తో విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు కలుగకూడదన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏడీఈ రాజేశ్వర్, ఏఈ భాస్కర్ ప్రసాద్ లైన్‌ఇన్‌స్పెక్టర్ యాదగిరి, లైన్‌మన్లు రవి నాయక్, సత్యనారాయణ, జూనియర్ లైన్‌మన్లు అరుణ్ కుమార్, అరుణ్ గౌడ్ పాల్గొన్నారు.

సినిమాలు | తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	క్రాక్-జీతేగా తో జీయేగా (హిందీ) - 10.10, 3.40, 9.45 తప్పించుకు తిరుగువాడు ధన్యుడు సుమతి (తెలుగు) - 1.30 సుందరం మాస్టర్ (తెలుగు) - 7.01
స్క్రీన్-2 –	భ్రమ యుగం (తెలుగు) - 12.00, 9.10 సిద్ధార్థరాయ్ (తెలుగు)-3.00 ఊరు పేరు భైరవ కోన(తెలుగు) - 6.10
స్క్రీన్-3 –	ఆర్టికల్-370 (హిందీ) - 1.00, 7.10, 10.35 సుందరం మాస్టర్ (తెలుగు) - 4.25
స్క్రీన్-4 –	ముఖ్యగమనిక (తెలుగు) - 1.05 మస్తు షేడ్స్ ఉన్నాయ్ రా - 1.50, హనుమాన్ (తెలుగు)-06.50 సుందరం మాస్టర్ (తెలుగు) - 10.10

సంక్షిప్తం

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో మోడల్ టెస్ట్

బోధన్: ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని పలు పాఠశాలలకు చెందిన పదో తరగతి విద్యార్థులకు మోడల్‌టెస్ట్ పరీక్షను మంగళవారం నిర్వహించారు. ఎంఈవో నాగ్‌నాథ్, ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ కార్యదర్శి సాయి కుమార్, నాయకులు జయంత్, పవన్ పాల్గొన్నారు.

ఆవులకు టీకాలు

మాక్లూర్: మండలంలోని కొత్తపల్లిలో సంకరజాతి ఆవులకు రోగ నిరోధక టీకాలు వేసినట్లు పశువైద్యాధికారులు మంగళవారం తెలిపారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి కిరణ్‌దేశ్‌పాండే, పశువైద్యురాలు ఉమా సహేర్, సిబ్బంది వినీత, గంగాజమున పాల్గొన్నారు.

ఆజాద్ ఆశయాలను కొనసాగిద్దాం

ఆర్మూర్: చంద్రశేఖర్ ఆజాద్ ఆశయాలను కొనసాగిద్దామని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నరేందర్ అన్నారు. పట్టణంలోని కుమార్ నారాయణ భవన్‌లో మంగళవారం పీడీఎస్‌యూ, పీవైఎల్ ఆధ్వర్యంలో ఆజాద్ చంద్రశేఖర్ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రగతిశీల యువజన సంఘం జిల్లా కార్యదర్శి రవి, నాయకులు నజీర్, సంజయ్, అనిల్, నిఖిల్, రాకేశ్‌చారి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ డీఈగా శివానందం

బోధన్‌టౌన్: మున్సిపల్ డీఈగా లింగంపల్లి శివానందం బదిలీపై వచ్చారు. నిజామాబాద్ కార్పొరేషన్ డీఈ సుదర్శన్ రెడ్డి బోధన్ బల్దియాకు ఇటీవల నిర్వహించిన బదిలీపై రాగా మంగళవారం ఆయన భైంసాకు బదిలీ అయ్యారు. కాగా గతంలో డీఈగా విధులు నిర్వహించిన శివానందం తిరిగి బోధన్‌కు బదిలీపై వచ్చి విధుల్లో చేరారు.

బీమా చెక్కు అందజేత

మాక్లూర్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బాధిత కుటుంబానికి రూ. పది లక్షల బీమా చెక్కును అందించినట్లు మండల పోస్టాఫీస్ అధికారి అరుణ్ మంగళవారం తెలిపారు. జీపీ కార్మికుడిగా పనిచేసే రంజిత్‌కుమార్ ఆరు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఈ చెక్కు మంజూరైనట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చింత మల్లారెడ్డి, పుణ్యరాజ్, లింగన్న పాల్గొన్నారు.

రైతులతో ఆర్డీవో చర్చలు

వేల్పూర్: మండలంలోని అంక్సాపూర్, పడగల్ ఒడ్డెరకాలనీ, కుకునూర్ గ్రామ రైతులతో ఆర్మూర్ ఆర్డీవో రవికుమార్, హైవే అధికారులు, ఏసీపీ బస్వారెడ్డి, తహసీల్దార్ సరిత ఆర్మూర్ ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం సాయంత్రం చర్చలు జరిపారు. 63వ నంబరు జాతీయ రహదారి విస్తరణ కోసం పడగల్ ఒడ్డెరకాలనీ, అంక్సాపూర్, కుకునూర్ గ్రామాల భూముల నుంచి బైపాస్‌రోడ్డు నిర్మాణానికి అధికారులు ప్రతిపాదించారు. మొదట అంక్సాపూర్ గ్రామస్తులు ఒప్పుకోవడంతోనే బైపాస్‌రోడ్డు నిర్మిస్తున్నామని అధికారులు పేర్కొన్నారు. కొందరు గ్రామస్తులు తమకు తెలియకుండా దొంగచాటుగా తీర్మాణం రాసి ఇచ్చారని, గ్రామస్తులకు తెలుపకుండా తీర్మాణం రాసి ఇచ్చినందుకు వారికి జరిమానా విధించామని, తమ భూములు ఎట్టి పరిస్థితుల్లో ఇవ్వబోమని అధికారులకు తెలిపారు. రైతులకు న్యాయం చేయాలని మాజీ జెడ్పీటీసీ పాశపు రాజేందర్‌రెడ్డి అధికారులను కోరారు. గురువారం హైదరాబాద్‌కు రానున్న కేంద్ర రవాణశాఖ మంత్రి నితిన్‌గడ్కరికి సమస్యను విన్నవిస్తామని మాజీ జెడ్పీటీసీ పేర్కొన్నారు.